సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 1 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 448 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



అమ్మకు ప్రేమతో ఐఏఎస్

అమ్మకష్టం చూసిన ఆ యువకుడు కసితో చదివాడు. ఐఏఎస్‌కు ఎంపికై అసిస్టెంట్ కలెక్టర్‌గా ప్రస్తుతం అనంతపురం జిల్లాలో సేవలందిస్తున్నాడు.

8లో

గరిష్టం/కనిష్టం 42.7°/23.6°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు ఖాతాల్లోకి 'రైతు భరోసా' సొమ్ము



పుట్టపర్తి అర్బన్: నవరత్న పథకాల్లో భాగంగా రైతుకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్'కు సంబంధించి ఐదో ఏడాది తొలి విడత సాయం గురువారం రైతు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందుకోసం గురువారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని సాయిఆరామంలో రైతులతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. జిల్లాలో 2,75,002 మంది రైతులు 'వైఎస్సార్ భరోసా'కు అర్హత సాధించగా, 2023 సంవత్సరానికి సంబంధించి తొలి విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.7,500 చొప్పున మొత్తం రూ.206.49 కోట్లు జమ అవుతుందన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున విచ్చేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

కొండ చిలువ కలకలం



టేకులోడు క్రాస్‌లో కనిపించిన కొండచిలువ

లేపాక్షి: మండల పరిధిలోని కనుమ టేకులోడు క్రాస్‌లో కొండచిలువ కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం ఎర్రకొండవైపు నుంచి వచ్చిన 8 అడుగుల కొండచిలువ జాతీయ రహదారి పక్కనే నిలిచిపోయింది. దీంతో చిలమత్తూరు– హిందూపురం మధ్య ప్రయాణించే వాహనదారులు రోడ్డుపైనే నిలిచిపోయారు. కొందరు దాన్ని కెమెరాల్లో బంధించారు. ప్రయాణికులు హడావుడి చేయడంతో కొండచిలువ చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది.

సవరించిన విలువతో నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం సవరించిన విలువ మేరకు గురువారం నుంచి రిజిస్ట్రేషన్లు జరుగుతాయని జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ విలువ సవరణ చట్టం–1998 ప్రకారం బహిరంగ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన విలువకు వ్యత్యాసం ఉందన్నారు. దీంతో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. సవరించిన భూముల విలువను ఆయా రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఉంచామన్నారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించి గురువారం నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సూచించారు.

ఉచిత శిక్షణ, ఉపాధికి దరఖాస్తు చేసుకోండి



లేపాక్షి: హిందూపురం ముక్కడిపేటలోని పాత ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన సిల్క్ హబ్ ద్వారా యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్ హబ్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన వారికి ల్యాండ్ సర్వేయింగ్‌పై, పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్ కోర్సులో, పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన వారికి ప్లంబింగ్, శానిటేషన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, మూడు ఫొటోలతో ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9908620306, 9052901657 నంబర్లలో సంప్రదించాలన్నారు.

శాశ్వత ఆనందం!

నియోజకవర్గాల వారీగా నిధుల వివరాలు	
పెనుకొండ :	రూ.33 కోట్లు
ధర్మవరం :	రూ.4.8 కోట్లు
హిందూపురం :	రూ.3.2 కోట్లు
కదిరి :	రూ.1.8 కోట్లు
మడకశిర :	రూ.0.6 కోట్లు
పుట్టపర్తి :	రూ.కోటి
మొత్తం :	రూ.44.4 కోట్లు

- సత్ఫలితాలిస్తోన్న 'గడప గడపకూ మన ప్రభుత్వం'
- ప్రజల ముంగిళ్లకే వెళ్తున్న ప్రజాప్రతినిధులు
- సమస్యలు విని.. పరిష్కారం చూపుతున్న వైనం
- శాశ్వత ప్రాతిపదికన పనులు చేయిస్తున్న యంత్రాంగం
- జిల్లాకు 1,507 పనులు మంజూరు కాగా, ఇప్పటికే 1,426 ప్రారంభం

సాక్షి, పుట్టపర్తి: నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తెచ్చే క్రమంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. జిల్లాల్లో 544 వార్డు/గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ముంగిళ్లలోనే ప్రజలకు సేవలందిస్తోంది. ఇక 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా సచివాలయాలు సందర్శిస్తున్నారు. సమస్యలను గుర్తించి అప్పటికప్పుడే నిధుల విడుదలకు సిఫారసు చేస్తున్నారు. వచ్చిన నిధులతో ప్రాధాన్యత ఆధారంగా పనులు ప్రారంభిస్తున్నారు. ఫలితంగా ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.



బత్తలపల్లి మండల కేంద్రంలో పాఠశాల భవనం సరిగా లేదని 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ప్రజలు విన్నవించారు. ఆయన ప్రతిపాదనలు పంపగా.. అధికారులు స్పందించి నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం శరవేగంగా పనులు జరుగుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యం పాత ఎస్సీ కాలనీలో చాలా రోజులుగా తాగు నీటి సమస్య ఉండేది. పక్క గ్రామానికి వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి. అయితే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి స్థానికులు సమస్య వివరించారు. ఆయన అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం కొత్త పైప్‌లైన్ వేసి కుళాయి ఏర్పాటు చేశారు. జగన్ ప్రభుత్వంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలోని సచివాలయాలు : 544
మంజూరైన పనులు : 1,507
ప్రారంభమైన పనులు : 1,426

మొత్తం సచివాలయాలు	544
ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు సందర్శించినవి	369
సందర్శించాల్సిన సచివాలయాలు	175
జిల్లాలోని గడపలు	6,09,316
ప్రజాప్రతినిధులు సందర్శించిన గడపలు	3,07,616
సందర్శించాల్సిన గడపలు	3,01,700
ఎమ్మెల్యేలు తిరిగిన రోజులు	670

మౌలిక వసతులకు పెద్దపీట..

ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో గుర్తించిన పనుల్లో ఇప్పటి వరకూ 1,507 పనులు మంజూరు కాగా, 1,426 పనులు ప్రారంభమయ్యాయి. రెండు వారాల్లో మిగిలిన పనులు కూడా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్య, రోడ్ల మరమ్మతులు, మురుగు కాలువల పునరుద్ధరణ, వీధి లైట్ల ఏర్పాటు, పాఠశాల భవన నిర్మాణాలు తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం..

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్ జగన్ సర్కార్ చేసినంతగా గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని అవ్వతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు ఆనందంతో చెబుతున్నారు. అడుగడుగునా ఆత్మీయ పలకరింపులు, ప్రజాప్రతినిధులకు ఎదురెళ్లి హారతులు పడుతున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులకు 'గడప గడపలో' ఆత్మీయ స్వాగతం లభిస్తోంది.

ప్రాధాన్యతా క్రమంలో పనులు



సచివాలయాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు విడుదల అవుతున్నాయి. ఆ సొమ్మును 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు వినియోగిస్తున్నాం.
– పి.అరుణ్‌బాబు, కలెక్టర్

నేటి నుంచి 'పింఛన్ కానుక' పంపిణీ

పుట్టపర్తి అర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక'ను వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,62,681 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, వారికోసం ప్రభుత్వం రూ.72,94,46,000 విడుదల చేసిందన్నారు. ఈ మొత్తాన్ని బుధవారమే సచివాలయ ఉద్యోగులు ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు.

8న ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

ధర్మవరం: ఖాళీ అయిన ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు జూన్ 8వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో ఎన్నిక ఉంటుందన్నారు. 4వ తేదీనే మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్లకు నోటీసులు ఇస్తామన్నారు. ఏదైనా కారణంతో 8న ఎన్నికల నిర్వహించలేకపోతే 9వ తేదీన నిర్వహిస్తామన్నారు.

ఉచిత కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, 'సీ–డాప్' సంయుక్తంగా నిర్వహిస్తున్న జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ అసోషియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన యువత కోర్సులకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ వెంటతీసుకురావాలన్నారు. మూడు నెలలు కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 7981541994, 9966968414 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తు చేస్తే సమాచారం ఇవ్వాల్సిందే





సమావేశంలో మాట్లాడుతున్న సమాచార హక్కు కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి, సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు

- ఆర్టీఐ కింద అందే దరఖాస్తులపై సత్వరం స్పందించాలి
- ఎలాంటి సమాచారం ఇవ్వకూడదో ఇప్పటికే తెలియజెప్పాం
- రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ హరిప్రసాద్ రెడ్డి

పుట్టపర్తి అర్బన్: నిబంధనలు అనుసరించి సమాచార హక్కు కింద అందే దరఖాస్తులకు సంబంధించిన సమాచారం తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ హరిప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఆర్టీఐ కింద ఎలాంటి సమాచారం ఇవ్వాలి... ఏది ఇవ్వకూడదనే విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, అడిషనల్ ఎస్పీ విష్ణు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీఐ కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరుతూ అధికారులకు అందే దరఖాస్తులను సెక్షన్ 6(1) కింద పరిగణించి సకాలంలో సమాచారాన్ని అందించాలన్నారు. దరఖాస్తుదారుడు సంబంధిత శాఖకు కాకుండా వేరొక శాఖకు సంబంధించిన సమాచారం అడిగితే దాన్ని 6(3) కింద బదిలీ చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అందే దరఖాస్తుల్లో 99 శాతం జిల్లా అధికారులు పరిష్కరిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి అందే దరఖాస్తుల్లో ఎక్కువ శాతం ఆయా వర్గాల హక్కుల సాధనకే ఉంటాయని, వాటి విషయంలో సానుకూలంగా స్పందించాలన్నారు. ఇక దినపత్రికల్లో వచ్చే ఆరోపణలు, అభియోగాలపై సమాచారం ఇవ్వడానికి వీల్లేదన్నారు. అలాగే కోర్టులకు సంబంధించిన కేసులు ఉన్న వాటిపై, ప్రభుత్వ ఉద్యోగి సర్వీసు రిజిష్టరు, ఇతర వ్యక్తి గత, జీతభత్యాల సమాచారం, రక్షణ రహస్యాలకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి వీల్లేదన్నారు. ప్రథమ అప్పిలేట్ అధికారి 30 రోజుల్లో సమాచారం 19(1) ద్వారా ఇవ్వాలన్నారు. పౌరులకు సమాచారం అందజేయడం, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

ప్రజల వద్దకే సమాచార కమిషన్..

సమాచార హక్కు చట్టం కేసుల పరిష్కారానికి అర్జీదారులు మంగళగిరిలోని కమిషన్ కార్యాలయం చుట్టూ తిరగనవసరం లేకుండా, అలాగే అధికారుల విలువైన కాలం వృథా కాకుండా ఆర్టీఐ కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తోందని కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల కేసుల పరిష్కారం వేగవంతంకావడంతో పాటు ఎందరికో మేలు జరుగుతుందన్నారు. అలాగే దరఖాస్తుదారు కోరుతున్న సమాచారాన్ని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంచితే సమాచారం కోరే దరఖాస్తుల సంఖ్య తగ్గుతుందన్నారు.

ఎప్పటికప్పుడు దరఖాస్తులకు పరిష్కారం..

కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పగడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఆర్‌ఓబీకి రూ.50 కోట్లు

- జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ధర్మవరం: పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేసింది. ముఖ్యంగా ధర్మవరం–తాడిపత్రి రోడ్డుకు మధ్యలో ఉన్న రైల్వేగేట్ వద్ద తరచూ వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో అక్కడ ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్‌ఓబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించారు. తాజాగా రూ.50 కోట్లు విడుదల చేస్తూ బుధవారం జీఓ విడుదల చేసింది. దీంతో ధర్మవరం పట్టణంలోని శివానగర్ నుంచి మార్కెట్ యార్డు వరకు నిర్మించనున్న ఆర్‌ఓబీ నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇందుకు సంబంధించి స్థల సేకరణ ప్రక్రియకు ప్రభుత్వం గతంలో రూ.50 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది. ప్రభుత్వ చర్యలపై పట్టణవాసులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి పరిశోధనలు కొనసాగాలి

- క్లస్టర్ యూనివర్సిటీ వీసీల సమావేశంలో నిర్ణయం



క్లస్టర్ యూనివర్సిటీ సమావేశంలో పాల్గొన్న ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ) వైస్ ఛాన్సలర్లు

అనంతపురం: యూనివర్సిటీలు ఉమ్మడి పరిశోధనలు కొనసాగించాలని వీసీల సమావేశంలో నిర్ణయించారు. జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనంలో బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ (ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ), సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ, శ్రీ సత్యసాయి డీమ్డ్ వర్సిటీ, రాయలసీమ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, కర్నూలు) వీసీల ప్రణాళికా సంఘం సమావేశమైంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూలై ఒకటి, రెండు తేదీల్లో తేదీల్లో ఉన్నత విద్య ప్రణాళికా సంఘం సమావేశం జేఎన్‌టీయూ కాకినాడలో జరగనుంది. ఇందులో క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించిన ప్రగతి నివేదికను వివరించనున్నారు. త్వరలోనే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆవిష్కరణ సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన, రెక్టార్ ఎం.విజయకుమార్, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వర్చువల్‌గా రాయలసీమ వర్సిటీ వీసీ ఆనందరావు, రిజిస్ట్రార్ సుందరానంద్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి, ఉర్దూ యూనివర్సిటీ వీసీ ఫజుల్ రెహమాన్, శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ వీసీ సాయి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



18 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 18 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అమడగూరు మండలంలో అత్యధికంగా 62.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా ఎన్పీ కుంటలో 36.4 మి.మీ, బుక్కపట్నం 26.6, సీకేపల్లిలో 22.4, ఓడీసీ 20.4, కొత్తచెరువు 19.2, పెనుకొండ 18.2, సోమందేపల్లిలో 17.4, రామగిరి 15.2, గాండ్లపెంట 13.2, పుట్టపర్తి మండలంలో 5.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. తాజా వర్షాలు ఖరీఫ్ సాగుకు మేలు చేస్తుండగా, రైతులు ఆనందంగా ఉన్నారు. అలాగే వేసవి తీవ్రతతో అల్లాడిన జనం కాస్త ఉపశమనం పొందారు.

యంత్ర సేవ.. సాగుకు తోవ

- రేపు 'వైఎస్సార్ యంత్ర సేవ' పథకం ప్రారంభం
- జిల్లాలోని 137 రైతు గ్రూపులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు



గత ఏడాది రైతులకు అందజేసిన ట్రాక్టర్లు

పుట్టపర్తి అర్బన్: రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు అందజేసి వ్యవసాయంలో రైతుకు సాయంగా నిలవడంతో పాటు వారికి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం 'వైఎస్సార్ యంత్ర సేవ పథకం' పేరుతో రైతు గ్రూపులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తోంది. ఇందుకోసం ఒక్కో రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒక ట్రాక్టర్, వలసమణి నూర్పిడి యంత్రం, రోటోవేటర్, గుంటక, మడక, స్ప్రేయర్, విత్తన గొర్రు, తదితర 15 రకాల యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతోంది. జిల్లాలో 416 రైతు భరోసా కేంద్రాలుండగా తొలి విడతలో 182 గ్రూపులకు 182 ట్రాక్టర్లు, 228 రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేసింది. ట్రాక్టర్లు, యంత్రాలు అందజేసిన రోజే రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ మొత్తం రూ.4.23 కోట్లు జమ చేయడం విశేషం. తాజాగా రెండో విడతలో 137 రైతు గ్రూపులకు పరికరాలు అందజేయనుంది.

50 శాతం సబ్సిడీతో యూనిట్లు మంజూరు..

ప్రస్తుతం జిల్లాకు 137 ట్రాక్టర్లను ప్రభుత్వం మంజూరు కాగా, ఒక్కో రైతు గ్రూపునకు ప్రభుత్వం రూ.15 లక్షల విలువైన యూనిట్లు అందజేస్తోంది. ఇందులో 50 శాతం అంటే రూ.7.5 లక్షలు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పిస్తోంది. తక్కిన రూ.7.5 లక్షలు రైతుల గ్రూపు నుంచి డిపాజిట్‌గా స్వీకరిస్తోంది. రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందజేసిన రోజే రైతులు చెల్లించిన డిపాజిట్‌లో 10 శాతం అంటే రూ.1.5 లక్షలు తీసుకొని తక్కిన 40 శాతం అంటే రూ.6 లక్షల మొత్తాన్ని తిరిగి రైతు గ్రూపుల ఖాతాల్లో జమ చేయనుంది.

అర్హత ఇలా...

'వైఎస్సార్ యంత్ర సేవ' పొందాలనుకునే వారికి గ్రామంలో భూమి ఉండాలి. తప్పనిసరిగా పట్టాదార్ పాస్ పుస్తకం ఉండాలి. ప్రతి రైతు గ్రూపుల్లో ఐదుగురు రైతులు ఉండాలి. అందులో ఒకరు కన్వీనర్, మరొకరు కో కన్వీనర్, మిగతా ముగ్గురు సభ్యులుగా ఉండాలి.

రేపు పోలీస్ పరేడ్ గ్రౌండులో పంపిణీ..

వైఎస్సార్ యంత్ర సేవ పథకంలో భాగంగా శుక్రవారం ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు రైతులకు అందజేసే బృహత్తర కార్యక్రమాన్ని పుట్టపర్తి సమీపంలోని పోలీస్ పరేడ్ గ్రౌండులో నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, రైతులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్లు పంపిణీతో పాటు సబ్సిడీ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేయనున్నారు.

రైతులకు ఎన్నో ప్రయోజనాలు..

వైఎస్సార్ యంత్రసేవ కింద సబ్సిడీతో ట్రాక్టరు తీసుకున్న రైతులు సొంతంగా పనులు చేసుకుంటూనే తక్కువ అద్దెతో ఇతర రైతుల పొలాల్లో వ్యవసాయ పనులు చేసే వీలు కలుగుతుంది. దీంతో కూలీల భారం తగ్గుతుంది. చిన్న, సన్న కారు రైతులకు సులభంగాను, తక్కువ ఖర్చుతో పనులు పూర్తవుతాయి.



క్లుప్తంగా

కుక్కల దాడిలో బాలికకు గాయాలు


గాయపడిన కావ్య

ధర్మవరం అర్బన్: స్థానిక కేశవనగర్‌లో బుధవారం ఉదయం గురుప్రసాద్ కుమార్తె కావ్యపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అంగడికి వెళుతుండగా మూడు కుక్కలు వెంటబడి దాడి చేశాయి. స్థానికులు వెంటనే కుక్కల బారి నుంచి బాలికను కాపాడి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ద్విచక్ర వాహనం ఢీ.. మహిళా రైతు మృతి


ఆనందమ్మ మృతదేహం

లేపాక్షి: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళా రైతు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం తిమ్మగానిపల్లికి చెందిన మహిళారైతు ఆనందమ్మ(52) పంట రుణాన్ని రెన్యువల్ చేసుకునేందుకు బుధవారం ఉదయం లేపాక్షికి వచ్చారు. మీ సేవా కేంద్రంలో 1బీ తీసుకుని రోడ్డుకు ఆవల ఉన్న బ్యాంక్ వద్దకు చేరుకుంటుండగా వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమైన ఆనందమ్మను స్థానికులు వెంటనే జాతీయ రహదారికి సంబంధించిన అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మకు ప్రేమతో ఐఏఎస్



పేరు : ప్రశాంత్‌కుమార్
పుట్టిన రోజు : 18-11-1994
చదువు : ఇంజినీరింగ్ (వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, హైదరాబాద్)
ఐఏఎస్‌కు ఎంపికైన సంవత్సరం : 2021
ర్యాంకు : 498
అభిరుచులు : మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో, తీరిక సమయంలో సినిమాలు చూడడం

- స్ఫూర్తి దాయకం.. ఐఏఎస్ ప్రశాంత్‌కుమార్ నేపథ్యం

తనను చదివించేందుకు తల్లి పడుతున్న కష్టాన్ని ఆ యువకుడు మరువలేదు. ఉన్నత స్థానానికి చేరి మాతృమూర్తి కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి చదివాడు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పరీక్షలో సత్తా చాటి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టుదల ఉండాలే గానీ సాధించలేనిదంటూ ఏదీ లేదని చెబుతున్న ఆ యువకుడు మరెవరో కాదు.. అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్. వృత్తి శిక్షణలో భాగంగా ఆత్మకూరు వచ్చిన ఆయన తన అంతరంగాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

– ఆత్మకూరు

మాది పార్వతీపురం. నాన్న బాబురావు ఆర్మీలో పని చేసి రిటైర్డయ్యారు. అమ్మ స్వర్ణలత ఏఎన్‌ఎం. అన్నయ్య ప్రదీప్. ప్రస్తుతం మల్టీ నేషనల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నేను ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు పార్వతీపురంలో, 8 నుంచి 10 వరకూ మహారాష్ట్రలోని నాసిక్‌లో చదివా. వైజాగ్‌లో డిప్లొమా చేశా. హైదరాబాదులోని వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 2017లో ఇంజినీరింగ్ పూర్తి చేశా.

అమ్మ కష్టమే చదివించింది..

నేను ఆరో తరగతి చదివేటప్పుడు రోడ్డు ప్రమాదంలో నాన్న బాబురావు మరణించారు. మా కోసం అమ్మ ఆ దుఃఖాన్ని దిగమింగి నన్ను, అన్నయ్యను కష్టపడి చదివించింది. తనకు వచ్చే జీతంతోనే మాకు ఏ లోటూ తెలియకుండా పెంచింది. అందుకే అమ్మ కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా కష్టపడి చదివా. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. అనుకున్నది సాధించి ఐఏఎస్‌గా ఎంపికై అమ్మకు కానుక అందించా.

మార్కుల కోసం చదవొద్దు..

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. మనపై ఉన్న నమ్మకమే మనల్ని ఉన్నత స్థాయికి చేరుస్తుంది. అనుకున్నది సాధించడానికి మూడు సంవత్సరాలు తీవ్రంగా కష్టపడ్డా. నేను మార్కుల కోసం ఎప్పుడూ చదవలేదు, చదివింది అర్థం అయేటప్పుడు ఆ సంతోషం వేరుగా ఉంటుంది. చాలా మంది డబ్బు ఉంటేనే సివిల్స్‌కు చదవగలం, రాయగలం అనుకుంటారు. కానీ నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వాడినే. కష్టపడి చదివా. మనం అనుకున్నది సాధించడానికి స్పష్టమైన లక్ష్యం ఉంటే చాలు.

ఆయన ప్రేరణతోనే సివిల్స్‌కు..

పార్వతీపురం మన్యం జిల్లాలోని మన్యం ఐటీడీఏ పీఓగా కొంతకాలం క్రితం ఐఏఎస్ లక్ష్మిష పనిచేశారు. పార్వతీపురం సమీపంలోని ఓ కొండపై కొన్ని గ్రామాలు ఉండేవి. సరైన వైద్య సదుపాయాలు లేక అక్కడి ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. మహిళలు గర్భం ధరిస్తే ప్రసవం కోసం కొండ మీద నుంచి అవస్థలు పడుతూ కిందకు తీసుకురావాల్సి వచ్చేది. అలా తీసుకొచ్చాక చాలా సార్లు ఆ మహిళనో లేదా పుట్టిన బిడ్డో చనిపోయేవారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ఐఏఎస్ లక్ష్మిష హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ప్రసవానికి మూడు నెలలు ఉండగానే సదరు మహిళను తీసుకువచ్చి అక్కడ ఉంచి.. వారితో యోగా సాధన చేయించడంతో పాటు మంచి ఆహారం అందించేవారు. దీంతో ప్రసవం తర్వాత తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేవారు. ఎందుకో తెలియదు ఒకసారి లక్ష్మిష గురించి మా అమ్మ నాకు చెప్పింది. ఒక ఐఏఎస్ తలచుకుంటే సమాజంలో ఎంతో మార్పు తీసుకురావొచ్చని వివరించింది. దీంతో నేనూ ఐఏఎస్ కావాలనిపించింది. నేను ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో శ్రీకాకుళంకు చెందిన గోపాల కృష్ణ అనే వ్యక్తి దేశస్థాయిలో సివిల్స్‌లో 3వ ర్యాంక్ సాధించారు. కష్టపడితే ఎవరైనా ఏదైనా సాధించవచ్చన్న విషయం ఆయన విజయంతో నాకు బోధపడింది.

నెగెటివ్‌గా మాట్లాడేవారిని పట్టించుకోవద్దు..

చాలా మంది విద్యార్థులు పదో తరగతిలో తప్పామనో, ఇంటర్ ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలా చేయడం చాలా తప్పు. ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి. నెగెటివ్‌గా మాట్లాడే వారిని పట్టించుకోవద్దు. మన మీద మనకు నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. నేను మూడో ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికయ్యా. మొదటి రెండు సార్లు చేసిన తప్పుల్ని సరిదిద్దుకుని సులువుగా గట్టెక్కా.

జిల్లావాసులు చాలా మంచివారు..

అనంతపురంలో కొన్ని నెలలుగా పనిచేస్తున్నా. జిల్లా ప్రజలు చాలా మంచి వారు. ఎలాంటి కల్మషం లేని మనుషులు. ఆత్మీయంగా పలకరిస్తారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా నాకు నచ్చిన విషయం ఏంటంటే ఎటుచూసినా పండ్ల తోటలు ఉండటం.

పూడిక తీత పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

ఓడీ చెరువు: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా ఓడీ చెరువు మండలం డబురువారిపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాల్లోని చెరువుల్లో చేపట్టిన పూడిక తీత పనులను డ్వామా పీడీ రామాంజనేయులు బుధవారం పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకం పనుల పరిశీలనకు కేంద్ర బృందం గురువారం రానున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పనుల్లో నాణ్యతను పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, ఈసీ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విత్తన విక్రయాలు

- ఉమ్మడి జిల్లాలో ఏడు దుకాణాలపై అధికారుల దాడులు


దుకాణాల్లో సోదాలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎలాంటి అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం నాలుగు బృందాలుగా విడిపోయి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో పెద్ద మొత్తంలో విత్తనాలు సీజ్ చేశారు. అనంతపురంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న కోకిల సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, శ్రీలేఖ ఫర్టిలైజర్స్‌లో మొత్తం రూ.1.87,630 విలువ చేసే 40.15 కిలోల విత్తన నిల్వలను సీజ్ చేసి వ్యవసాయశాఖాధికారులకు అప్పగించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిగిలోని నందిని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ ఏజెన్సీ, భూమిపుత్ర ఆగ్రో ఏజెన్సీలో తనిఖీలు చేపట్టి రూ.1 లక్ష విలువ చేసే 46 కిలోల విత్తనాలను సీజ్ చేశారు. అక్రమంగా విత్తనాలు అమ్మకాలు సాగిస్తున్న దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐలు సాయి ప్రసాద్, రామారావు, వెంకటరమణ, ఏఓ జె.వాసు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు


భూములు పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఆర్డీఓ భాగ్యరేఖ హెచ్చరించారు. మండలంలోని కర్ణాటక నాగేపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆర్డీఓ బుధవారం ఉదయం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పుట్టపర్తి–నల్లమాడ రహదారిలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సమీపంలోని కొండ ప్రాంతంలో సర్వే నంబర్ 646, 647లో 25.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గతంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినా ఎవరూ నిర్మాణాలు చేపట్టక పోవడంతో రద్దు చేశారు. సదరు భూమిలో 9.30 ఎకరాలను స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయించారు. అదే చోట 342 జాతీయ రహదారి నిర్మాణానికి 4 ఎకరాల భూమిని స్వాధీనం చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మిగులు భూమిలో కొందరు జేసీబీలు ఏర్పాటు చేసి రేయింబవళ్లు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. దీంతో బుధవారం ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ నవీన్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ దాదాపీర్, వీఆర్వో మనోహర్ అక్కడికెళ్లి పరిశీలించారు. ఇకపై ఎవరైనా మట్టి తరలిస్తే జేసీబీలు, ట్రాక్టర్లు సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కుక్కల దాడిలో 20 గొర్రెల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఓడీ చెరువు: మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని నారప్పగారిపల్లిలో కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి చెందాయి. బాధిత కాపరులు మల్లప్ప, చంద్ర తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి వర్షం కురవడంతో గొర్రెల మందలో నిద్రిస్తున్న మల్లప్ప, చంద్ర లేచి ఇంట్లోకి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున లేచి మందలోకి వచ్చి చూడగా 20 గొర్రెలు మత్యువాతపడ్డాయి. మరో పది గొర్రెలు తీవ్రంగా గాయాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కుక్కల దాడిలోనే గొర్రెలు మృతి చెందినట్లుగా అక్కడి ఆనవాళ్లను బట్టి స్థానికులు నిర్ధారించారు. దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు కాపరులు వాపోయారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శివశంకర్‌రెడ్డి బుధవారం ఉదయం ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. రూ.5వేలు సాయం అందజేశారు. గొర్రెల కళేబరాలను ఎంపీడీఓ పోలప్ప, ఈఓఆర్డీ రాజశేఖర్ పరిశీలించారు. నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

ఏపీజీబీ ద్వారా విరివిగా రుణాలు

- డీబీఎస్ సేవలు ప్రారంభించిన చైర్మన్ రాకేష్‌కశ్యప్


మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభ్యున్నతికి, అన్ని రంగాల పురోగతికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా విరివిగా రుణాలు అందజేస్తున్నట్లు ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. ఆధునికీకరించిన అనంతపురంలోని ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు (డీబీఎస్), కాల్‌సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జీఎం గిరి, ఆర్ఎం మోహన్‌రెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. 10 జిల్లాల పరిధిలో విస్తరించిన ఏపీజీబీ సేవల ద్వారా 60 లక్షల మంది ఖాతాదారుల మన్ననలు పొందుతున్నామన్నారు. దీంతో బ్యాంకు వ్యాపార టర్నోవర్ రూ.41,600 కోట్లకు చేరుకుందన్నారు. డిపాజిట్లు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా మంచి లాభాలు ఆర్జించినట్లు పేర్కొన్నారు. బ్యాంక్ కార్యకలాపాల్లో అనంతపురం రీజియన్ అత్యంత కీలకమన్నారు. రూ.5,688 కోట్ల టర్నోవర్‌తో అన్ని రీజియన్ల కన్నా ముందంజలో ఉందన్నారు. ఇందులో రూ.2,722 కోట్ల డిపాజిట్లు, రూ.2,966 కోట్ల రుణాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూనే మహిళా సంఘాలు, విద్యా, వ్యాపార, హౌసింగ్, వాహన రుణాలు కూడా పెద్ద మొత్తంలో అది కూడా సరళీకృతమైన విధానంలో అందిస్తున్నట్లు తెలిపారు. తాజాగా డిజిటల్ సేవలు అందుబాటులోకి తేవడంతో రానున్న కాలంలో మరింత మెరుగ్గా ఖాతాదారుల మన్ననలు పొందుతామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

తల్లి, కుమార్తెను కాపాడిన పోలీసులు


బాధితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొత్తచెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు సిద్ధమైన తల్లి, కుమార్తెను పోలీసులు సకాలంలో కాపాడారు. ఎస్‌ఐ లింగన్న తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం మందలపల్లికి చెందిన శివమ్మ, కుమార్తె సాయి సులోచన బుధవారం ఉదయం ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో పెనుకొండకు వెళ్లే మార్గంలో పట్టాలపై కూర్చొని ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది తాము ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైనట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. దీంతో ఇద్దరినీ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి, అనంతరం గోరంట్ల పోలీసుల ద్వారా కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఇద్దరి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లు రవి, సౌందర్య, హోంగార్డు వెంకటరాముడుని ఎస్‌ఐ లింగన్న అభినందించారు.

ట్రాక్టర్ అపహరణ

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో రైతు శ్రీనివాస్‌కు చెందిన 2019 మోడల్ మహీంద్రా ట్రాక్టర్‌తో పాటు కల్టివేటర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. మంగళవారం వ్యవసాయ పనులు ముగించుకుని గ్రామం నుంచి అగళి మండలానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ట్రాక్టర్‌ను నిలిపి, ఇంటికెళ్లి నిద్రించాడు. బుధవారం ఉదయం అక్కడు చేరుకుని చూడగా ట్రాక్టర్ కనిపించలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీసినా ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశారు.

అర్ధరాత్రి దాకా అభ్యంతరాల పరిశీలన

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ టీచర్ల బదిలీల ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట దాకా సాగింది. ఇందుకోసం అనంతపురం సైన్స్ సెంటర్‌లో ఆరు బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు దాకా సభ్యులున్నారు. డీఈఓ ఎం.సాయిరాం ప్రత్యేక పర్యవేక్షణలో అభ్యంతరాలను పరిశీలిస్తున్నారు. ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాపై మంగళవారం సాయంత్రానికి 633 వచ్చినా.. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉండడంతో అర్ధరాత్రి సమయానికి 731 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో అత్యధికంగా 300 దాకా స్టేషన్ సీనియార్టీ పాయింట్లపైనే ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అలాగే రేషనలైజేషన్, స్పౌజ్‌కేటగిరి, సర్వీస్‌పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరి, పీహెచ్ కేటగిరిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. గురువారం సాయంత్రానికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని డీఈఓ తెలిపారు.

ఒంటరి మహిళలే టార్గెట్

- జ్యూస్‌లో నిద్రమాత్రలిచ్చి ఆభరణాల చోరీ
- అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్
- 124.8 గ్రాముల బంగారు, సెల్‌ఫోన్లు, నిద్రమాత్రలు స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివారెడ్డి

రాప్తాడు రూరల్: మాటలే ఆ దొంగకు పెట్టుబడి. ఒంటరి మహిళలే లక్ష్యంగా తన మాటలతో బుట్టలో వేసుకుంటాడు. వారే ఇళ్లకు పిలుచుకునేలా చేస్తాడు. ఎంచక్కా భోజనం చేస్తాడు. ఆ తర్వాత తాను తెచ్చుకున్న జ్యూస్‌లో నిద్రమాత్రలు కలిపి మహిళలకు ఇస్తాడు. తాగగానే స్పృహ కోల్పోయిన మహిళల ఒంటిపై బంగారు నగలు అపహరించుకెళతాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20కి పైగా కేసులు నమోదైన కేటుగాడి ఆటను ఎట్టకేలకు అనంతపురం రూరల్ పోలీసులు కట్టడి చేశారు. వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లా కోట మండలం శ్యామచంద్రాపురం గ్రామానికి చెందిన చేవూరి చంద్ర అలియాస్ చంద్రబాబు తన 16వ ఏట ఇల్లు వదిలి జులాయిగా మారాడు. తన వ్యసనాలకు అవసరమైన డబ్బును సులువుగా సంపాదించుకునేందుకు దొంగతనాలకు తెరలేపాడు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు వేచి ఉన్న ఒంటరి మహిళలతో మాట కలిపి, ఆకట్టుకుంటాడు. అనంతరం వారి ఫోన్ నంబర్లు, చిరునామా సేకరించుకుని, తరచూ ఫోన్లు చేస్తూ పలకరించి వారే ఇళ్లకు పిలిచేలా చేస్తాడు. ఈ క్రమంలో వారి ఆహ్వానం మేరకు ఇంటికి వెళ్లే సమయంలో ఓ జ్యూస్ బాటిల్ కొనుగోలు చేసి అందులో నిద్రమాత్రలు కలిపి, మాటలతో జ్యూస్‌ను మహిళల చేతే తాగించి వారు నిద్రలోకి జారుకోగానే విలువైన బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లేవాడు. ఈ క్రమంలో అనంతపురం నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ మహిళను, తాడిపత్రిలో మరో మహిళను వంచించాడు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి నిందితుడి కోసం గాలిస్తున్నారు. గతంలో ఇతనిపై నంద్యాల, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల్లో 20కు పైగా కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో జైలు నుంచి బయటకు రాగానే అనంతపురం, తాడిపత్రి, ముషీరాబాద్‌లో చోరీకి పాల్పడ్డాడు.

అరెస్ట్ ఇలా...

రూరల్ పీఎస్ సీఐ విజయభాస్కర్‌గౌడ్‌కు రాబడిన పక్కా సమాచారంతో ఎస్‌ఐ నబీరసూల్, కానిస్టేబుళ్లు శివన్న, జయరాం, పాండవ.. బృందంగా ఏర్పడి, ఆర్టీసీ బస్టాండు సమీపంలో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ. 6.40 లక్షల విలువ చేసే 124.8 గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్లు, నిద్రమాత్రలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు.

డీటీసీగా వీర్రాజు



అనంతపురం సెంట్రల్: జిల్లా రవాణాశాఖ ఉప రవాణా కమిషనర్‌గా వీర్రాజు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శివరామప్రసాద్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన దాదాపు నాలుగేళ్లుగా ఉమ్మడి జిల్లా డీటీసీగా సమర్థవంతంగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన డీటీసీగా నియమితులైన వీర్రాజు ప్రస్తుతం అనకాపల్లి ఆర్టీఓగా పనిచేస్తున్నారు. పదోన్నతిపై డీటీసీగా ఆయనకు అనంతపురం కేటాయిస్తూ పోస్టింగ్ ఇచ్చారు.

బావిలో పడి యువకుడి మృతి


బావిలో తేలుతున్న సూర్యప్రకాష్ మృతదేహం

పుట్టపర్తి అర్బన్: మద్యం మత్తులో బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పోలీసులు తెలిపిన మేరకు.. విశాఖపట్నంలోని రామకృష్ణ నగర్‌కు చెందిన మోహన్‌రావు కుమారుడు సూర్యప్రకాష్ (28) తొమ్మిదేళ్ల బెంగళూరులోని రైల్వే క్యాంటీన్‌లో పనిచేశాడు. కరోనా కాలంలో పని మానేసి జులాయిగా మారాడు. మద్యం సేవిస్తూ కాలం గడిపేవాడు. ఈ క్రమంలో రైల్వే క్యాంటీన్‌లో తనతో పాటు పనిచేసిన ధర్మవరం మండలం బసంపల్లికి చెందిన సుబ్బయ్య కుమారుడు భానుచంద్రతో కలసి పుట్టపర్తిలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గత నెల 30వ తేదీ మద్యం సేవించిన అనంతరం కప్పలబండ శివారులోని వ్యవసాయ బావిలోకి ఈతకు వెళ్లారు. కాసేపు ఈత కొట్టిన తర్వాత భానుచంద్ర గదికి వెళ్లిపోయాడు. ఒంటరిగా బావిలో ఈతకొడుతున్న సూర్యప్రకాష్ మద్యం మత్తు ఎక్కువై నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. ఎవరూ లేకపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు. బుధవారం ఉదయం బావిలో తేలుతున్న సూర్యప్రకాష్ మృతదేహాన్ని గమనించిన స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జయానాయక్ తెలిపారు.